ధరలో దగా.. తూకంలో దోపిడీ

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పత్తి కొనుగోళ్లు
- రోడ్ల పక్కనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దళారుల తీరుతో నష్టపోతున్న అన్నదాతలు
- చోద్యం చూస్తున్న అధికారులు


చెన్నూర్ కత్తెరసాల రోడ్డులో అక్రమంగా కొనుగోలు చేస్తున్న పత్తి

చెన్నూర్: దళారులు పత్తి అక్రమ కొనుగోళ్లకు తెర లేపారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో రోడ్ల పక్కనే అక్రమ కొనుగోలు కేంద్రాలు తెరిచారు. ధరలో దగా, తూకంలో దోపిడీ చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. మార్కెట్ లైసెన్స్‌లు లేకుండా, పత్తి అక్రమంగా కొనుగోలు చేస్తూ ఇటు ప్రభుత్వ ఆధాయానికి, అటు రైతులను దోచుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. పత్తి ఎకరానికి 15నుంచి 20క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ ఏడాది ఎకరానికి 5క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒక పక్క దిగుబడి, మరో పక్క ధర లేక పెట్టిన పెట్టుబడి ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అక్రమ పత్తి దందా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

జిల్లాలో పత్తి ..

జిల్లాలో ఈ ఏడాది రైతులు 1,55.714ఎకరాలలో పత్తి సాగు చేశారు. గత ఏడాది పత్తి క్వింటాళ్‌కు


చెన్నూర్ జాతీయ రహదారి పక్కన...

ధర రూ.7వేల నుంచి రూ.8వేలు పలికింది. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. గతేడాది రైతులకు కొంత లాభాలు వచ్చాయి. ఈ ఏడాది పత్తి ధర బాగుటుందని ఆశించారు. సాగు పెట్టుబడి పెరిగింది. వర్షాభావ పరిస్థితులు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. దిగుబడితో పాటు ధర ఆశించిన మేర లేకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు.

దళారులు క్వింటాళ్‌కు రూ.6300..

సీసీఐ పత్తికి మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7020 ప్రకటించింది. పత్తి 8శాతం తేమ లేకుండా తీసుకొస్తే సీసీఐ మద్దతు ధర చెల్లిస్తుంది. రైతుల అవసరాలను ఆసరగా చేసుకొని వ్యాపారులు క్వింటాళ్‌కు రూ.6200నుంచి రూ.6300చెల్లిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. తరుగు పేరుతో క్వింటాళ్ పత్తికి ఐదు కిలోల పత్తిని తీసుకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు.

అప్పులే శరణ్యం...



రూ.3లక్షలు పెట్టి పది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. ఎకరానికి పెట్టుబడి రూ.30వేలు ఖర్చు అయ్యింది. కౌలుతో ఎకరానికి రూ.60 వేలు అయ్యింది. పంట దిగుబడి లేదు. ఎకరానికి ఐదు క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. ఆశించిన ధర లేదు. అప్పులే మిగిలాయి.

– బజ్జూరి మధు, కౌలు రైతు, చెన్నూర్

'ప్రజాపాలన' విజయవంతం చేయండి

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభించనుండగా, మంచిర్యాల మున్సిపాలిటీలోని 36వార్డుల్లో విజయవంతం చేయాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బందికి బుధవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ వరకు ఉంటుందని, పబ్లిక్ సెలవులు డిసెంబర్ 31, జనవరి 1 మినహా 8పనిదినాలలో రెండు షిఫ్టుల్లో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇందుకోసం మున్సిపాలిటీలోని 36వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం కోసం కేంద్రాలను ఏర్పాటు చేసి, వార్డు ఆఫీసర్లు, మెప్మా, అంగన్‌వాడీ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతివార్డులో వార్డు సభను నిర్వహించి, వార్డు కౌన్సిలర్‌తో పాటు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని, ప్రతి క్యాంపు వద్ద వీల్‌చైర్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ మధుకర్, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నూర్ మున్సిపాలిటీలో...

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 18వార్డుల్లో ప్రజాపాలన గ్రామసభలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజులు ఈ నెల 31, వచ్చే నెల 1న ఉండడంతో ఆ రెండు రోజుల మినహాయించి మిగితా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

ప్రజాపాలనపై సమీక్ష



వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజాపాలనపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి గ్రామసభకు ముందు ఆరు గ్యారంటీలకు సంబంధించి లబ్ధిదారులు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఏపీఓ సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో...

తాండూర్: ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి గజానంద్ సిబ్బందికి సూచించారు. ప్రజాపాలన గ్రామసభల కార్యక్రమాల సన్నాహ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేలు రెండు టీంలకు టీం లీడర్లుగా వ్యవహరించనున్నారు. ఈ నెల 28న బోయపల్లి, రాజీవ్ నగర్, 29న తాండూర్, అచ్చలాపూర్, 30న రేచిని, మాదారం-ఇంక్‌లైన్, జనవరి 2న కిష్టంపేట, మాదారం, 3 కొత్తపల్లి, కాసిపేట, 4న నర్సాపూర్, చౌటపల్లి, 5న నీలాయపల్లి, గోపాల్‌నగర్, 6న ద్వారకపూర్ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయాధికారి కిరణ్మయి, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


తాండూర్: వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీవో

భీమినిలో...

భీమిని: మండలంలో ఈ నెల 28న అక్కళ్లపల్లి, చిన్నతిమ్మాపూర్, ఖర్జీభీంపూర్, మల్లీడిలో, 29న లక్ష్మీపూర్, వెంకటాపూర్, పెద్దపేట, బిట్టూర్‌పల్లి, 30న కేస్లాపూర్, చిన్నగుడిపేట, జనవరి 2న వీగాం, భీమినిలో నిర్వహిస్తున్నారు. కన్నెపల్లి మండలంలో 28న వీరాపూర్, ముత్తాపూర్, రెబ్బెన, టేకులపల్లి, 29న పోలంపల్లి, నాయకునిపేట, గొల్లగట్టు, 30న కన్నెపల్లి, జన్కాపూర్, జనవరి 2న మాడవెల్లి, జజ్జరవెల్లి, సాలిగాం, 3న సుర్జాపూర్, మెట్‌పల్లి, 4వ తేదీన లింగాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు భీమిని, కన్నెపల్లి మండలాల ఎంపీడీఓలు జవహర్, రాధాకిషన్ తెలిపారు.

నస్పూర్‌లో..

నస్పూర్: నేటి నుంచి ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బుధవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసామని తెలిపారు. 28నుంచి జనవరి 6వరకు ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ఇబ్బంది లేకుండా చూడాలి

బెల్లంపల్లిరూరల్: ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. మండలంలో నేటి నుంచి ప్రారంభం కానున్న గ్రామసభల వివరాలను వెల్లడించారు. 28న అంకుశం, బుచ్చయ్యపల్లి, గురిజాల, దుగ్నెపల్లి, 29న బుధాకుర్దు, లింగాపూర్, మాలగురిజాల, లంబాడితండా, 30న పాతబెల్లంపల్లి, చంద్రవెల్లి, బుధాకలాన్, ఆకెనపల్లి, జనవరి 2న పెర్కపల్లి, సోమగూడెం, 3న బట్వాన్‌పల్లి, 4న చాకేపల్లి, కన్నాల పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ సుధాకర్ రెండు టీంలకు టీమ్ లీడర్లుగా వ్యవహరించనున్నారు.

భీమారంలో...

భీమారం: మండలంలోని ప్రజాపాలన సభల వివరాలను ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 28న ఆరెపల్లి, పోలంపల్లి, నర్సింగాపూర్, బూర్గుపల్లి, 29న భీమారం, కాజిపల్లి, మద్దికల్, కొత్తపల్లి, 30న ఎలకేశ్వరం, దాంపూర్, ధర్మారం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సమక్షంలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లక్సెట్టిపేటలో...

లక్సెట్టిపేట: ప్రజాపాలన కార్యక్రమం ఈ నెల 28నుంచి నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. అభయహస్తం పథకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జన్నారంలో...

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న వెంకటాపూర్, మల్యాల్, మొర్రిగూడ, మహ్మదాబాద్, 29న ఇందన్‌పల్లి, పొనకల్, మురిమడుగు, తిమ్మాపూర్, 30న జన్నారం, తపాలపూర్, కలమడుగు, చింతగూడ, జనవరి 2న రేండ్లగూడ, తొమ్మిదిగుడిసెలపల్లి, సింగరాయిపేట, రోటిగూడ, 3న లింగయ్యపల్లి, కొత్తపేట, 4న బాదంపల్లి, లోతొర్రే, చింతలపల్లి, దేవునిగూడ, 5న కిష్టాపూర్, కవ్వాల్, ధర్మారం, కామన్‌పల్లి, 6న హాస్టల్ తాండా, రాంపూర్, బంగారుతాండ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మా ఊరికి బస్సులు నడపండి

మంచిర్యాలఅర్బన్: సారూ.. ఆర్టీసీ బస్సులు లేకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.. మా ఊరికి బస్సులు నడపాలని డయల్ యువర్ డీఎంకు ప్రయాణికులు విన్నవించారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారం.. సలహాలు సూచనలకు బుధవారం డయల్‌యువర్ డీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు తమ సమస్యలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. కాసిపేట మండలం గట్టురావుపల్లికి బస్సు నడపాలని నలుగురు ప్రయాణికులు కోరారు. దేవాపూర్‌కు అదనపు బస్సు వేయాలని, హాజీపూర్ మండలం నర్సింగపూర్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసు తిప్పాలని, భీమినికి బస్సు నడపాలని ప్రయాణికులు డీఎం రవీంద్రనాథ్ దృష్టికి తీసుకురాగా కొత్తగా బస్సులు రాగానే నడిపేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

విద్యార్థులకు సన్మానం

మంచిర్యాలఅర్బన్: అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మంచిర్యాల జోనల్ స్థాయిలో మాథ్స్ ఒలంపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన స్థానిక అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులను సంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి సన్మానించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు నగదు పారితోషకం, సర్టిఫికేట్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌తో పాటు జ్ఞాపికలను అందజేశారు. 6వ తరగతి చదువుతున్న కీర్తి సహస్ర, కావేరి, సుహన్, ఏడో తరగతికి చెందిన అమూల్య, నక్షత్ర, షద్మఅన్జుమ్, ఎనిమిదో తరగతికి చెందిన అలీనా నాజ్, సైయద్ మిస్బా ఫాతిమా, యం.మనురాజ్, తొమ్మిదో తరగతికి చెందిన మనోగన, రసగ్న, సంజనా సౌమ్య, పదోతరగతికి చెందిన నాగచైతన్య, ముజాఫర్ ఆహ్మద్‌ఖాన్, ప్రణవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానం సాధించగా నగదు, సర్టిఫికేట్లను అందజేశారు.

దరఖాస్తుల స్వీకరణ విజయవంతం చేయాలి


నెన్నెలలో అధికారులకు అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ కలెక్టర్

నెన్నెల: మండల అధికారులు, కార్యదర్శులు సమన్వయంగా పని చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీల దరఖాస్తు స్వీకరణ విజయవంతం చేయాలని డెప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి సిడాం దత్తు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులు బీఎల్‌ఓల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, విద్యుత్ ఏఈ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాసిపేట: మందమర్రి ఏరియా కేకే ఓసీలో డోజర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో చనిపోయిన మిట్ట నగేష్ కుటుంబ సభ్యులకు బుధవారం తోటి డ్రైవర్‌లే రూ.3లక్షల 11వేల ఏడువందలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి
- క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం


మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఈ నెల 28నుంచి వచ్చే నెల 6వరకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు సరిగ్గా నింపేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు తోడ్పాటునందించాలని సూచించారు. డీఎంఎఫ్‌టీ నిధులు వాస్తవానికి మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లోనే ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికీ డీఎంఎఫ్‌టీ ఫండ్స్ పలుచోట్ల దుర్వినియోగమయ్యాయన్నారు. మిషన్ భగీరథ పనులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు సర్వం సిద్ధం

బెల్లంపల్లి: రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం గురువారం నుంచి ప్రజాపాలన కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ప్రభుత్వ పథకాల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో వార్డు సభలను, మండలాల పరిధిలో గ్రామసభలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు స్వీకరించి ప్రజలకు రశీదులు అందజేస్తారు. రోజువారీగా ఉదయం 8గంటలకు ఓ గ్రామం/వార్డులో, మధ్యాహ్నం 2గంటలకు మరో గ్రామం/వార్డులో సభలను నిర్వహిస్తారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేశారు.

నోడల్ అధికారిగా ఆర్డీవో..

ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణ కోసం బెల్లంపల్లి డివిజన్ నోడల్ (ప్రత్యేక) అధికారిగా ఆర్డీవో హరికృష్ణను నియమించారు. అదేతీరుగా మండలాలు, మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారులను ఎంపిక చేశారు. కాసిపేట మండల ప్రత్యేక అధికారిగా డీటీడీఓ ఎం.గంగారాం, బెల్లంపల్లి మండల ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీ.హెచ్ దుర్గాప్రసాద్, తాండూర్ మండలానికి జిల్లా మార్కెటింగ్ అధికారి వై.గజానంద్, భీమినికి డీఆర్‌డీఏ ఏపీడీ దత్తారావు, కన్నెపల్లి మండలానికి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, నెన్నెల మండలానికి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు, వేమనపల్లి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యానవన అధికారి వి.ఉదయ్‌కుమార్‌ను నియమించారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో 34వార్డులకు టీమ్‌లను ఎంపిక చేశారు.

తొలిరోజు ఎమ్మెల్యే గైర్హాజరు ...!

ప్రజాపాలన కార్యక్రమానికి తొలిరోజు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ గైర్హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరగనున్న కాంగ్రెస్ సభకు హాజరు కానున్నట్లు సమాచారం. దీంతో ప్రజాపాలన కార్యక్రమం ఎమ్మెల్యే లేకుండానే నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మొదటిరోజు డివిజన్ నోడల్ అధికారి హరికృష్ణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. శుక్రవారం లేదా శనివారం నుంచి ఎమ్మెల్యే వినోద్ ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

అయ్యప్ప మహా పడిపూజ

బెల్లంపల్లి/దండేపల్లి: బెలపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో, దండేపల్లి గూడెం శ్రీఅభినవ శబరి మలై అయ్యప్ప ఆలయంలో బుధవారం పడిపూజ నిర్వహించారు. బెల్లంపలిలో కాంగ్రెస్ నాయకుడు హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పడిపూజలో పాల్గొని అయ్యప్పకు పూజలు చేశారు. దండేపలిలో పదునెట్టాంబడిని అలంకరించి పూజలు చేశారు.

అన్నదానం

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం పడిపూజ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద లయన్స్ క్లబ్ మంచిర్యాల సభ్యులు చేపడుతున్న అన్నదాన కార్యక్రమం బుధవారం 60వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు.


తాండూర్: ఓటు వేస్తున్న మహిళా కార్మికులు


జైపూర్: తొలిసారి ఓటేసిన మహిళా ఉద్యోగులు


మొదటిసారి ఓటేసిన యువకులు

గనులపై 'గుర్తింపు' సందడి

పలుమార్లు వాయిదా పడిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ఎట్టకేలకు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నేపథ్యంలో గనులపై ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద కార్మికుల సందడి కనిపించింది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకుల తోపాటు ఎమ్మెల్యే వివేక్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. చాలా మంది యువ ఓటర్లు తొలిసారి ఓటుహక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు.

– శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/తాండూర్/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/జైపూర్/కాసిపేట


కాసిపేట: సూచనలు చేస్తున్న ఏసీపీ సదయ్య


తాండూర్: పోలింగ్ స్టేషన్ ఎదుట బందోబస్తు


ఎస్సార్పీ 3 వద్ద టీబీజీకేఎస్ నాయకులు


బెల్లంపల్లి: శాంతిగని పోలింగ్ కేంద్రం వద్ద...


ఎస్సార్పీ 1 గని వద్ద జనక్‌ప్రసాద్


ఓటింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే వివేక్


ఎస్సార్పీ 1 గని వద్ద సీతారామయ్య

సంక్షిప్త వార్తలు

మహిళల సంరక్షణకు కృషి

నస్పూర్: బాలికల, మహిళ సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధికై మహిళా సాధికారత హబ్ కృషి చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక తెలిపారు. పట్టణ పరిధిలోని మహిళా సాధికారిక కేంద్రం విలేజ్ నస్పూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆమె ఫైనాన్సియల్ లిటరసీ లిప్సికతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

క్రీడా శిక్షణ ప్రారంభం

లక్సెట్టిపేట: జనవరి 17 నుంచి ఊట్నూరులో నిర్వహించే ఇంటర్ సొసైటీ లీగ్ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక మహాత్మా జ్యోతీ బాపూలే గురుకుల బాలుర పాఠశాలలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. బీసీ సొసైటీ డిప్యూటీ కార్యదర్శి తిరుపతి బుధవారం ఈ క్రీడా శిక్షణ పోటీలను ప్రారంభించారు.

ట్రయల్‌రన్ సక్సెస్‌పై హర్షం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ట్రయల్‌రన్ సక్సెస్‌పై మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. గూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ గతంలో లీకేజీలకు గురికావడంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, సమస్య పరిష్కారం కోసం తాను ప్రత్యేక చొరవ తీసుకుని, పంప్‌హౌస్ నుంచి రెండు కిలో మీటర్ల మేర జీఆర్‌పీ పైప్‌లైన్ తొలగించి, దాని స్థానంలో ఎమ్మెఎస్ పైప్‌లైన్ వేయించినట్లు తెలిపారు. దీంతో ఇక రైతులకు పైప్‌లైన్ లీకేజీ సమస్య ఉండదన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండల యాదవ సంఘం కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జక్కుల తిరుపతి (లింగయ్యపల్లి), ఉపాధ్యక్షులుగా వంగ శ్రీనివాస్, బైరి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా సంఘ అంజిత్(కలమడుగు), కార్యదర్శిగా ఎల్లముల రాజశేఖర్, కోశాధికారిగా మెంగని మహేశ్, ముఖ్య సలహాదారులుగా జంగిలి సత్తయ్య, పెంగర్ల రాజమల్లు, రాయమల్లు, పెద్దొళ్ల శంకర్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

మండల కన్వీనర్‌గా రవీందర్

లక్సెట్టిపేట: జాతీయ మాల మహానాడు మండల కన్వీనర్‌గా పట్టణానికి చెందిన గరిసె రవీందర్‌ను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.